**రిపోర్టర్లు కావలెను**

జనం కోసం నిరంతరం అక్షర సమరం చేసేందుకు దూసుకు వస్తున్న 'జర్నలిస్ట్ ఫైల్' దినపత్రికకు ఏపీలో జిల్లా ప్రతినిధులుగా పనిచేయుటకు విలేకరులు కావలెను. తెలుగులో స్పష్టంగా మాట్లాడటం, ఆసక్తి, అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యత. కొత్త వారికి అవకాశం ఉంటుంది.

సంప్రదించాల్సిన సెల్ నెం :
9502535152, 7416812467



శనివారం 29.06.2024

INK OF TRUTH

# జర్నలిస్ట్ ఫైల్

తెలుగు దినపత్రిక

సంపుటి - 32 సంచిక -145 www.journalistfile.com పేజీలు 4 వెల : రూ.5.00


## వైసీపీ కార్యాలయాల కూల్చివేతపై మరో రెండు లంచ్ మోషన్ పిటిషన్లు



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ఏపీ హైకోర్టులో వైఎస్సార్సీపీ మరో రెండు లంచ్ మోషన్ పిటిషనులు దాఖలు చేసింది. ఉండి, నరసరావుపేటలో వైఎస్సార్సీపీ కార్యాలయాల కూల్చివేతలకు అధికారులిచ్చిన నోటీసులను సవాల్ చేస్తూ పిటిషన్లు వేసింది. ఈ పిటిషన్లను అనుమతిచ్చిన ఏపీ హైకోర్టు శుక్రవారం విచారణ జరిపి.. స్టేటస్ కో విధించింది. మొత్తం 18 వైఎస్సార్సీపీ కార్యాలయాలు యథాస్థితిలో కొనసాగేలా కోర్టు స్టేటస్ కో ఇచ్చింది.

కాగా, రాష్ట్రవ్యాప్తంగా కూల్చివేతలపై ఇచ్చిన నోటీసులపై వైఎస్సార్సీపీ హైకోర్టును ఆశ్రయించిన సంగతి తెలిసిందే. అయితే చర్యలు తీసుకోవద్దని.. యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలంటూ బుధవారం ఆదేశాలిచ్చింది. అయితే.. తదుపరి నిర్ణయం వెలువరించేంత వరకు ఆ స్టేను పొడిగిస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ గురువారం ఉత్తర్వులు జారీచేశారు.

కూల్చివేతలపై అధికారులను నియంత్రించాలంటూ పిటిషన్లు.. అన్ని జిల్లాల్లోని తమ పార్టీ కార్యాలయాల కూల్చివేతలకు పురపాలక శాఖాధికారులు జారీచేసిన షోకాజ్ నోటీసులను, ప్రాథమిక ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్ సీపీ, ఆ పార్టీ నేతలు హైకోర్టులో వేర్వేరుగా పిటిషన్లు దాఖలు చేశారు. కూల్చివేతకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేయాలని కోరారు. అలాగే, కూల్చివే తలకు పాల్పడకుండా అధికారులను నియంత్రిస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలంటూ అనుబంధ వ్యాజ్యాలు దాఖలు చేసిన విషయం తెలిసిందే.

# పోలవరాన్ని నాశనం చేశారు

- పోలవరాన్ని చూస్తే నా కళ్ల వెంట నీళ్లొచ్చాయి
- పోలవరానికి జగన్ ఓ శాపం
- పోలవరం ధ్వంసం జాతికి జరిగిన విద్రోహం
- ఐదేళ్లలో 3.84శాతం పనులే జరిగాయి.. రూ.3,385 కోట్లు మళ్లించారు
- నాడు టీడీపీ హయాంలోనే 72 శాతం పనులు పూర్తి
- టీడీపీ హయాంలో పోలవరం పనులకు ప్రశంసలు..
- వైసీపీ హయాంలో పీపీఏ, ఐఐటీ నిపుణుల చీవాట్లు
- పోలవరం ఆలస్యంతో రైతులకు రూ.45 వేల కోట్ల నష్టం
- పోలవరం ప్రాజెక్టుపై తొలి శ్వేత పత్రాన్ని విడుదల చేసిన సీఎం చంద్రబాబు




**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక టీడీపీ అధినేత చంద్రబాబు దూకుడు పెంచారు. అధికారులతో వరసగా సమావేశాలు, సమీక్షలు నిర్వహిస్తూ.. గత ప్రభుత్వంలో జరిగిన అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే ఏడు ప్రభుత్వ శాఖల్లో శ్వేతపత్రాలు విడుదల చేస్తామని చెప్పారు. దీనికి ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ఆంధ్రప్రదేశ్ జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టుపై తొలి శ్వేత పత్రాన్ని సీఎం చంద్రబాబు విడుదల చేశారు. వైసీపీ ప్రభుత్వంలో పోలవరంలో జరిగిన అవకతవకలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

ఏపీకి జీవనాడిగా భావిస్తున్న పోలవరం ప్రాజెక్ట్ నిర్మాణం గత వైసీపీ ప్రభుత్వ హయాంలో కుంటుపడిన సంగతి తెలిసిందే. పోలవరం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి అని, అలాంటి ప్రాజక్టును 5 ఏళ్లపాటు (2019-24) ఎలా విధ్వంసం చేసారో ఈ సందర్భంగా చంద్రబాబు వివరించారు. టీడీపీ అధికారంలో ఉన్నప్పుడు పోలవరం పనులు ఒక యజ్ఞంలా సాగాయని, అప్పట్లో ఉన్న సమస్యలను, సవాళ్లను అధిగమించి మరీ ముందుకు వెళ్లామని చంద్రబాబు గుర్తుచేశారు. ఒక్క రోజులోనే స్పిల్ ఛానల్‌లో 32,215 క్యూబిక్ మీటర్ల కాంక్రీట్ పనులు చేసి నాటి ప్రభుత్వం గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ సాధించిందని చంద్రబాబు గుర్తుచేశారు. గత టీడీపీ ప్రభుత్వ

2 లో

## చంద్రబాబు తప్పు వల్లే పోలవరం నాశనం



**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** పోలవరం ప్రాజెక్టు నిర్మాణంపై సీఎం చంద్రబాబునాయుడు శ్వేత పత్రాలు విడుదల చేసిన విషయం తెలిసిందే. జగన్ ప్రభుత్వం పోలవరాన్ని నాశనం చేసిందని ఆయన ఆరోపించారు. దీంతో మాజీ మంత్రి అంబటి రాంబాబు స్పందించారు. పోలవరంపై చంద్రబాబు శ్రద్ధ లేదు.. మాజీ మంత్రి అంబటి స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కరోనా సమయంలోనూ పనులు ఆగలేదని తెలిపారు. చిన్న తప్పుకూడా లేకుండా ప్రాజెక్టు పనులు జరిగాయని తెలిపారు. మళ్లీ జగన్ పుంజుకుంటారనే భయం చంద్రబాబులో కనిపిస్తోందన్నారు. సీఎం అయిన తర్వాత చంద్రబాబుకు అహం పెరిగిందని మండిపడ్డారు. పదే పదే జగన్ ను దూషిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలవరం ప్రాజెక్టు అంత తేలికగా అర్థం కాదు కాబట్టే చాలా స్టడీ చేసి నిర్ణయానికి వచ్చామన్నారు. చంద్రబాబు చేసిన తప్పు వల్లే పోలవరం ప్రాజెక్టు నాశనమైందన్నారు. ప్రోటోకాల్ పాటించకపోవడం వల్లే పోలవరం ప్రాజెక్టు ఆలస్యానికి కారణమని మాజీ మంత్రి అంబటి చెప్పారు.

## భద్రత పెంచాలంటూ హైకోర్టులో పెద్దిరెడ్డి పిటీషన్



అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ): తమకు భద్రత పెంచాలని వైసీపీ మాజీ మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ మిథున్ రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. మంత్రిగా ఉన్నసమయంలో మంత్రి పెద్దిరెడ్డికి 5౦5 భద్రత ఉండేది. ప్రస్తుతం 1 ౦ 1 సెక్యూరిటీ మాత్రమే ప్రభుత్వం కల్పిస్తుంది. తమకు భద్రత పెంచాలని కోర్టును కోరారు. తమ భద్రతపై సెక్యూరిటీ రివిజన్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. ఈ పిటిషన్పై హైకోర్టు ధర్మాసనం విచారణ జరిపింది. గత ప్రభుత్వంలో మంత్రిగా పని చేసిన పెద్దిరెడ్డికి 5౦5 భద్రత కల్పించిందని, ప్రస్తుతం ఆయన ఎమ్మెల్యేగా ఉన్నారు కాబట్టి 1౦1 భద్రత ఏర్పాటు చేశామని కోర్టు దృష్టికి ప్రభుత్వం తెలిపింది. దీంతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది.



## సీఎం చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును తెలంగాణ గవర్నర్ రాధాకృష్ణన్ కలిశారు. శుక్రవారం ఉదయం ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చిన తెలంగాణ గవర్నర్ మర్యాదపూర్వకంగా కలిశారు. తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న విభజన సమస్యలు, పెండింగ్ అంశాలపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు తెలుస్తుంది. దీనికిముందు గవర్నర్‌కు మంత్రి నారా లోకేశ్ స్వాగతం పలికి మంగళగిరి చేనేత శాలువాతో ఆయనను సత్కరించారు.

## అందుకే జగన్ కు ప్రజలు గుణపాఠం చెప్పారు

◆ మాజీ సీఎం జగన్ పై తెలంగాణ సీఎం సంచలన వ్యాఖ్యలు



**పొలిటికల్ డెస్క్ ( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి డిల్లీ పర్యటనలో ఉన్న విషయం అందరికీ తెలిసిందే. ఈనేపథ్యంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. వైసీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. టీడీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ సీఎం నారా చంద్రబాబు నాయుడు తనకు ఫోన్ చేసినందుకే హైదరాబాద్ లో జగన్ ఇంటి వద్ద నిర్మాణాలు తొలిగించానని వైసీపీ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని తెలిపారు.

ఇలా టీడీపీపై బురదజల్లి ఆంధ్ర రాష్ట్రంలో టీడీపీని ఖతం చేయాలని ప్రయత్నించే చివరికి జగనే ఖతమైయ్యారని ఆయన పేర్కొన్నారు. 2019 ఎన్నికల్లో 151 సీట్లతో అధికారంలోకి వచ్చిన జగన్ ఇటీవల ఎన్నికల్లో కేవలం 11 సీట్లకే పరిమితమయ్యారంటే దానికి జగన్ చేసుకున్న స్వయంకృపరాధమే కారణం అని అన్నారు. పాలనను విస్మరించి, అక్రమాలకు పాల్పడడంతో పరిశ్రమలు కుప్పకూలి రాష్ట్రం దెబ్బతింది అని, అందుకే జగన్ కు ప్రజలు గుణపాఠం చెప్పారని అన్నారు.

అలానే వైసీపీ నేతలు తనని కలిసినందుకు వారిని జగన్ తిట్టిన సందర్భాలున్నాయని ఆయన పేర్కొన్నారు. జగన్ ఆనాలోచిత చర్యలకు, అవినీతి, అక్రమాలకు విసిగివేశారిన ప్రజలు జగన్ ను ప్రతిపక్షంలో సైతం చూడాలని అనుకోలేదని అందుకే 11 సీట్లకే పరిమితమైయ్యారని వైఎస్ జగన్ ను సీఎం రేవంత్ రెడ్డి ఎద్దేవా చేశారు.

# అప్రమత్తంగా ఉండండి

**భారీ వర్షాలపై హెూంమంత్రి అనిత సమీక్ష..**

- 8 జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పరిస్థితులపై ఆరా..
- వర్షాలు, వరద ప్రభావిత ప్రాంతాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశం..
- ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్ ను స్వయంగా పరిశీలించిన మంత్రి అనిత..
- ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్ విధులను మంత్రి అనితకు వివరించిన అధికారులు..

2లో

## డయేరియా నివారణకు తక్షణమే స్పెషల్ డ్రైవ్

- మంచి నీటి పైప్ లైన్ ల లీకేజిలను 24 గంటల్లో అరికట్టాలి
- రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ

2లో



## 'ప్రజాదర్బార్' తో భరోసా

### మంత్రి నారా లోకేష్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రజా నేత నారా లోకేష్ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుండి "ప్రజాదర్బార్" కార్యక్రమాన్ని చేపట్టి ప్రజలకు దగ్గరగా ఉంటున్నారు. ప్రజాదర్బార్ కు వచ్చిన ప్రజలను కలిసి వాళ్ల సమస్యలను తానే స్వయంగా తెలుసుకుని, వీలైనంత త్వరగా ఆ సమస్యల పరిష్కారానికి యత్నిస్తున్నారు. కాగా తాను చేపట్టిన ప్రజాదర్బార్ పై నారా లోకేష్ ట్విట్టర్ వేదికగా స్పందించారు. 'కష్టాల్లో ఉన్న ప్రజలకు అండగా నిలిచేందుకు నేను చేపట్టిన "ప్రజాదర్బార్"కు వినతులు వెల్లువెత్తుతున్నాయి.

తమ సమస్యలు చెప్పుకునేందుకు మంగళగిరి నియోజకవర్గంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి ప్రజలు ఉండవల్లిలోని మా నివాసానికి చేరుకున్నారు. ప్రతి ఒక్కరి సమస్యను విన్నాను. ఆయా సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని వారికి భరోసా ఇచ్చాను. సమస్యలను సంబంధిత శాఖలకు పంపి సత్వర పరిష్కారానికి సిబ్బందికి ఆదేశాలు జారీ చేశా' అంటూ ట్వీట్ చేశారు.

ఇక ఆపన్నులకు అండగా మంత్రి నారా లోకేష్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' పై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సమస్యలు విన్నవించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి జనం పెద్ద ఎత్తున ఉండవల్లిలోని లోకేష్ నివాసానికి తరలివస్తున్నారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా ఉదయం నుంచే వస్తున్నారు. మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్ అండతో రూ. 4 కోట్ల విలువైన తమ భూమి కబ్జా అయిందని, తనకు న్యాయం చేయాలని కోరారు. విశాఖ జిల్లా, గాజువాక మండలం, దువ్వాడలో రూ. 4 కోట్ల విలువైన తమ 84 సెంట్ల భూమిని గత వైసీపీ ప్రభుత్వ అండతో దేవెళ్ల వెంకటరమణ, రావి సత్యనారాయణ కబ్జా చేశారని, తమకు న్యాయం చేయాలని గాజువాక మండలం, డ్రైవర్ కాలనీకి చెందిన చూచుకొండ శ్రీనివాసరావు, జాగరపు తాతారావు మంత్రి లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. మాజీ మంత్రి గుడివాడ అమర్ నాథ్, సీఐ బి.శ్రీనివాసరావు అండతో ఫోర్జరీ డ్యాక్యుమెంట్లు సృష్టించి సదరు భూమిని అక్రమించారని యువనేత ఎదుట బాధితులు వాపోయారు. ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ తమకు ఎలాంటి న్యాయం జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. కబ్జాదారులపై చట్టపరమైన చర్యలు తీసుకుని తమ భూమిని

2 లో

## తోటపల్లి కుడి ప్రధాన కాలువ నీరు విడుదల

**నీటిని విడుదల చేసిన మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి**



**పార్వతీపురం మన్యం జిల్లా ( జర్నలిస్ట్ ఫైల్ ):** గరుగుబిల్లి మండలంలో ఉల్లిభద్ర వద్ద గల సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నీటిని కుడి కాలువ నుండి ఖరీఫ్ పంటకు నీరును అందించేందుకు రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ శాఖ మరియు గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యా రాణి శుక్రవారం నీరును విడుదల చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద జరిగిన కార్యక్రమంలో పాలకొండ శాసన సభ్యులు నిమ్మక జయకృష్ణ, కురుపాం శాసన సభ్యులు తోయక జగదీశ్వరి సమక్షంలో మంత్రి నీటిని విడుదల చేశారు. వర్షం కురుస్తున్నా లెక్కచేయక రైతుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని నిరూపిస్తూ నీటిని విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రాజెక్టు క్రింద మొత్తం 1,31,221 ఎకరాల ఆయకట్టుకు నీరు అందనుంది. కుడి ప్రధాన కాలువ క్రింద పార్వతీపురం మన్యం జిల్లాలో సీతానగరం, బలిజిపేట మండలాలలో 27 గ్రామాలకు చెందిన 13,684 ఎకరాలకు సాగునీరు అందుతుండగా విజయనగరం జిల్లాలో బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం నియోజక వర్గాలలోని 13 మండలాలలో 66 గ్రామాలకు చెందిన 25,060 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల నియోజక వర్గంలో జి సిగడాం, లావేరు, రణస్థలం మండలాలలో 105 గ్రామాలకు చెందిన 38,975 ఎకరాలకు సాగునీరు అందుతుంది. వెరసి 333 గ్రామాలకు చెందిన 1,31,221 ఎకరాలకు ప్రధాన కుడి కాలువ ద్వారా సాగునీరు అందుతుంది. ఇందులో 84,033 ఎకరాలు స్థిరీకరణ, 47,188 ఎకరాలు కొత్త ఆయకట్టుగా ఉంది. ఈ సందర్భంగా మంత్రి సంధ్యా రాణి మాట్లాడుతూ పూడికలు, తుప్పలు తొలగించి శివారు భూములకు సైతం నీరు అందించాలని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అపర భగీరధుడని, తోటపల్లి ప్రాజెక్ట్ ను ప్రారంభించి శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలను సస్యశ్యామలం చేసారని తెలిపారు. తోటపల్లి, జంఝావతి ప్రాజెక్టులు, పూర్ణపాడు – లాబేసు వంతెన నిర్మాణం పూర్తి చేయుటకు ప్రయత్నిస్తున్నామని ఆమె చెప్పారు. ఇది రైతు ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకర రావు, పర్యవేక్షక ఇంజనీరు రాజరాజేశ్వరి, కార్యనిర్వాహక ఇంజనీర్లు జి.రామచంద్రరావు, ఆర్ అప్పల నాయుడు, ఉప కార్యనిర్వాహక ఇంజనీర్ శ్రీహరి స్థానిక ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ‘ప్రజాదర్బార్’ తో భరోసా : లోకేష్

(మొదటి పేజీ తరువాయి)

కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సమస్య విన్న మంత్రి నారా లోకేష్ పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని వారికి హామీ ఇచ్చారు.

**కరెంట్ బిల్లు సాకుతో వితంతు పెన్షన్ తొలగించారు..**

విద్యుత్ షాక్‌తో రెండు చేతులు కోల్పోయిన తనకు వికలాంగ పెన్షన్ మంజూరు చేసి ఆదుకోవాలని మంగళగిరి నియోజకవర్గం యర్రబాలెంకు చెందిన తాటిబోయిన రవీంద్ర మంత్రి నారా లోకేష్‌ను కలిసి విజ్ఞప్తి చేశాడు. కరెంట్ బిల్లు సాకుతో వైసీపీ ప్రభుత్వం తొలగించిన వితంతు పెన్షన్ పునరుద్ధరించాలని తాడేపల్లి మండలం, పోలకంపాడుకు చెందిన అనవాయమ్మ, హైమావతి మంత్రిని కోరారు. అందరి సమస్యలను సానుకూలంగా విన్న లోకేస్ పరిశీలించి పరిష్కరిస్తామని చెప్పారు.

# కలసికట్టుగా మాచర్లను అభివృద్ధి చేసుకుందాం

## • ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి



**మాచర్ల ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఎన్నికల వరకే రాజకీయాలు చేసుకోవాలని అనంతరం అందరూ కలిసి మాచర్ల ప్రాంతం అభివృద్ధి చేసుకోవాలని మాచర్ల నియోజకవర్గ ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానంద రెడ్డి చెప్పారు. మాచర్ల పట్టణంలోని పురపాలక సంఘం మున్సిపల్ కౌన్సిల్ హాల్లో నిర్వహించిన సాధారణ సమావేశానికి హాజరై పేదవాడి ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ మరమ్మత్తులకు మరియు ఒకటవ వార్డు నుంచి 31 వ వార్డు వరకు మున్సిపాలిటీ వాటర్ పైపు లేని పట్టణ శివారు ప్రాంతాలకు వాటర్ ట్యాంకుల ద్వారా నీరు అందించే ఈ రెండు అంశాలను కౌన్సిల్తో కలిసి ఆమోదించారు. అనంతరం కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదించిన కొన్ని అంశాలపై కమిటీ ద్వారా చర్చించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు.

మాచర్ల పట్టణంలో డెంగ్యూ వ్యాధి కేసులు అధికంగా నమోదు అవుతున్నాయని తన దృష్టికి వచ్చిందని సానిటరీ విభాగం వారు దోమలు లేకుండా తగు చర్యలు తీసుకోవాలని కమిషనర్ గారిని కోరారు. అతి త్వరలోనే బుగ్గ వాగు లిఫ్ట్ ఇరిగేషన్ స్కీమ్ ద్వారా పట్టణంలోని ప్రతి ఇంటికి పైపులైన్ ద్వారా మంచి నీటిని అందిస్తామన్నారు. మాచర్ల పట్టణానికి వెల్దుర్తి మాచర్ల మండలం దుర్గి రెంట చింతల మండలాల నుంచి అత్యధిక సంఖ్యలో మహిళలు తమ కుటుంబాల కోసం వస్తూ ఉంటారని వారికి కనీసం మరుగుదొడ్లు లేవని వాటి దృష్టిలో ఉంచుకొని వీలైనంత తొందరలో పట్టణంలో మరుగుదొడ్లు నిర్మించాలని అన్నారు. కౌన్సిల్ సమావేశం అనంతరం కౌన్సిలర్లు మొత్తం జూలకంటి బ్రహ్మానంద రెడ్డి గారిని గజమాలతో సత్కరించి కేక్ కట్ చేయించారు. ఈ కార్యక్రమంలో మాచర్ల మున్సిపల్ చైర్మన్ చిన్న ఏసోబు కౌన్సిలర్లు మదర్ సాహెబ్ రామిరెడ్డి నరసింహారావు సుభాని మున్సిపల్ కమిషనర్ వెంకట దాసు మున్సిపల్ ఏఈ లు సిబ్బంది పాల్గొన్నారు.

## డయేరియా నివారణకు తక్షణమే స్పెషల్ డ్రైవ్

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులను అరికట్టేందుకై అవసరమైన అన్ని చర్యలను చేపట్టేందుకు తక్షణమే స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ అధికారులను ఆదేశించారు. మంచినీటి పైపుల్లో లీకేజి లు ఉంటే 24 గంటల్లో అరికట్టాలని, కాలువల్లో చెత్తాచెదారాన్ని జూలై మాసాంతాని కల్లా తొలగించాలని ఆదేశించారు. అమరావతి సచివాలయంలోని ఐదో బ్లాక్ కాన్ఫరెన్స్ హాల్ లో రాష్ట్రంలోని మొత్తం 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు, ఇంజినీరింగ్ అధికారులతో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, దానికి తగ్గట్లుగా ముందస్తు నివారణ చర్యల కోసం ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని కమిషనర్లకు సూచించారు. ఇప్పటి వరకూ మున్సిపాల్టీల్లో ఎక్కడా డెంగ్యూ కేసులు రాలేదని, అక్కడక్కడా డయేరియా కేసులు మాత్రమే నమోదు అయ్యాయన్నారు. దీనిపై వైద్యారోగ్యశాఖ అధికారులతో కూడా చర్చించినట్లు మంత్రి తెలిపారు. డయేరియా నివారణకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని, డ్రెయిన్ లలో సిల్ట్ తొలగించి నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చూడాలన్నారు. త్రాగునీటి సరఫరా పైపుల లీకేజీల నియంత్రణకు, కాలువల్లో చెత్తాచెదరాన్ని తొలగించి పారిశుద్య పరిస్థితులను మెరుగు పర్చేందుకు దాదాపు రూ. 50 కోట్లను త్వరలో విడుదల చేయనున్నట్లు మంత్రి తెలిపారు.

ఈ సమావేశంలో పాల్గొన్న కమిషనర్లు వారి కార్పొరేషన్లలో అమలు చేయబడుచున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా మంత్రికి వివరించారు. మున్సిపల్ కార్పొరేషన్ల ఆర్థిక పరిస్థితిని వివరించడంతో పాటు తాగునీరు సరఫరా మెరుగుకు, మురుగునీటి పారుదల వ్యవస్థ అభివృద్ధికి, డ్రెయిన్ లలో మురుగు తొలగింపుకు తీసుకుంటున్న చర్యలను వివరించారు.

రాష్ట్ర పురపాలక మరియు పట్టణాభివృద్ధి శాఖ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ సింఘాల్, ఏపీ అర్బన్ ఫైనాన్సు, ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలెప్మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ డి.హరిత, సిడిఎంఏ శ్రీధర్, టౌన్ ప్లానింగ్ డైరెక్టర్ విద్యుల్లత, పబ్లిక్ హెల్త్ ఇంజనీరింగ్ ఇన్ చీఫ్ ఆనందరావు మరియు 17 మున్సిపల్ కార్పొరేషన్ల కమిషనర్లు ఈ సమీక్ష సమావేశం లో పాల్గొన్నారు.

## ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన పల్లా శ్రీనివాసరావు



**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** పల్లా శ్రీనివాసరావు ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధ్యక్షుడిగా శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ నేపథ్యంలో టిడిపి కేంద్ర కార్యాలయం ఎన్టీఆర్ భవన్ లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. టీడీపీ అధినేత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు. అలానే పార్టీని, ప్రభుత్వాన్ని, నేతలను సమన్వయం చేసుకుంటూ ముందుకెళ్తానని పల్లా శ్రీనివాసరావు ప్రకటించారు.

తెలుగుదేశం పార్టీకి బలం, బలగమైన కార్యకర్తలకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. తనకు ఏపీ టీడీపీ అధ్యక్షుడిగా నియమించినందుకు నారా చంద్రబాబుకు, మంత్రి లోకేష్కు ధన్యవాదాలు తెలిపారు.

# పోలవరాన్ని నాశనం చేశారు

(మొదటి పేజీ తరువాయి)

హయాంలో అటు హెడ్ వర్క్సుల పనులు చేస్తూనే ఎగువ, దిగువ కాఫర్ కాఫర్ డ్యాంల నిర్మాణం పనులు పూర్తి చేశామని చెప్పారు. ప్రాజెక్టులో కీలకమైన డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని రికార్డు సమయంలో 414 రోజుల్లో పూర్తి చేశామని చంద్రబాబు ప్రస్తావించారు.

**72 శాతం పనులకు రూ. 11,537 కోట్లు ఖర్చు**

రెండు కిలోమీటర్ల పొడవుతో, 100 మీటర్ల పైగా లోతుతో డయాఫ్రం వాల్ నిర్మాణం చేపెట్టామని చంద్రబాబు గుర్తుచేశారు. జర్మన్ కంపెనీ ‘బావర్’ ద్వారా ఈ పనులు పూర్తి చేయించామని పేర్కొన్నారు. స్పిల్ వే గేట్ల డిజైన్లు సిద్ధం చేసి.. గేట్ల అమరిక సైతం అప్పట్లోనే ప్రారంభించామని చంద్రబాబు గుర్తుచేశారు. ప్రాజెక్టుకు సంబంధించి ప్రతి పనికి పీపీఏ, కేంద్ర జలవనరుల శాఖ నుంచి అనుమతులు తీసుకున్నామని, అప్పట్లో జల వనరుల శాఖా మంత్రులుగా ఉన్న ఉమాభారతి, నితిన్ గడ్కరీలు పోలవరం వచ్చి పనులు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారని ప్రస్తావించారు.

టీడీపీ హయాంలోనే పోలవరం ప్రాజెక్టు పనులు 72 శాతం పూర్తయ్యాయని, 5 ఏళ్ల కాలంలో 28 సార్లు క్షేత్ర స్థాయి పర్యటనకు, 82 సార్లు వర్చ్యువల్‌గా చేశానని చంద్రబాబు పేర్కొన్నారు. టీడీపీ 5 ఏళ్ల కాలంలో మొత్తం 72 శాతం పనులు జరగగా.. అందుకు రూ. 11,537 కోట్లు ఖర్చయ్యాయి.

**పోలవరానికి జగన్ ఓ శాపం**

“పోలవరంపై మొదటి శ్వేతపత్రం విడుదల చేస్తున్నాం. సాగునీటి ప్రాజెక్టులపై రెండో శ్వేతపత్రం ఇస్తాం. రాష్ట్ర అభివృద్ధికి జీవనాడి పోలవరం. నదుల అనుసంధానానికి గుండెలాంటిది. ఇలాంటి పోలవరానికి జగన్ ఒక శాపంలా మారారు. ఈ ప్రాజెక్టు విషయంలో క్షమించరాని నేరం చేశారు. రాష్ట్రానికి అమరావతి, పోలవరం రెండూ ప్రధాన ప్రాజెక్టులు. ఈ రెండూ రాష్ట్రానికి రెండు కళ్లులాంటివి. ఈ రెండూ పూర్తి చేసుకుంటే విభజనలో జరిగిన అన్యాయాన్ని, నష్టాన్ని పూడ్చుకొనే అవకాశం ఉంటుంది. రాష్ట్రాన్ని నాశనం చేసే హక్కు ఎవరికీ లేదు. పోలవరం ధ్వంసం జాతికి జరిగిన విద్రోహం. రాష్ట్ర అభివృద్ధికి జలవిద్యుత్ కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తే వ్యవసాయ రంగానికి ఊతం వస్తుంది. విభజన వల్ల జరిగిన నష్టం కంటే జగన్ చేసిన నష్టమే అధికం. 2014-19 మధ్య పోలవరానికి రూ. 11,762 కోట్లు ఖర్చు చేశాం. వైసీపీ ప్రభుత్వం కేవలం రూ. 4,167 కోట్లు మాత్రమే ఖర్చు చేసింది. జగన్ మూర?త్వం వల్లే డయాఫ్రమ్ వాల్ దెబ్బతింది. జగన్ ప్రమాణం చేస్తూనే పోలవరం పనులు ఆపేశారు” అన్నారు.

**జగన్ హయాంలో తప్పుడు నిర్ణయాలు - రివర్స్ టెండర్లు..**

గత ఐదేళ్లలో వైసీపీ హయాంలో పోలవరం ప్రాజెక్టు విషయంలో తప్పుడు నిర్ణయాలు - రివర్స్ టెండర్ల డ్రామాలు ఆడారని చంద్రబాబు మండిపడ్డారు.



నాడు 2019లో వైసీపీ ప్రభుత్వంలో జగన్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన రోజు సాయంత్రమే పోలవరం పనులు నిలిపివేస్తూ ఆదేశాలు ఇచ్చారని చంద్రబాబు గుర్తుచేశారు. సైట్‌లో నిర్మాణ సంస్థ ఖాళీ చేయాల్సిందిగా జులై 29, 2019న నోటీసులు జారీ చేశారని, 2019 జులై 24న ఇచ్చిన పీటర్ కమిటీ రిపోర్టు ఆధారంగా రివర్స్ టెండర్ల డ్రామా ఆడారని చంద్రబాబు విమర్శించారు. పోలవరంలో అవినీతే జరగలేదని కేంద్రం తేల్చిందని, డిసెంబర్ 02, 2019న స్వయంగా పార్లమెంట్‌లో స్పష్టంగా పేర్కొందని వివరించారు. పనులు చేస్తున్న సంస్థను కాదని, ఆధారాలు లేని ఆరోపణలు చేసి కాంట్రాక్టర్‌ను మార్చడం వల్ల పోలవరం మరింత ఆలస్యం అయిందని చంద్రబాబు పేర్కొన్నారు. ఇక నిబంధనలకు విరుద్ధంగా రివర్స్ టెండరింగ్ పేరుతో రిజర్వ్ టెండర్లకు పాల్పడ్డారని, ప్రాజెక్టు జగన్ సర్కార్ దెబ్బతీసిందని చంద్రబాబు మండిపడ్డారు. రివర్స్ టెండర్ల ద్వారా రూ. 738 కోట్లు ఆదా అని ముందు గొప్పలు చెప్పారని, కానీ చివరకు డయాఫ్రం వాల్‌ను దెబ్బతీశారని చంద్రబాబు విచారం వ్యక్తం చేశారు.

**ఐదేళ్లలో 3.84 శాతం పనులే జరిగాయి.. రూ. 3,385 కోట్లు మళ్లించారు..**

జగన్ చేసిన విధ్వంసంతో పోలవరం ప్రాజెక్టు భౌగోళిక పరిస్థితులు మారాయి. జగన్ సర్కార్ అసమర్థతతో గైడ్ బండ్ కుంగిపోయింది. రూ. 80 కోట్లతో నిర్మించిన ఈ గైడ్ బండ్ నిరుపయోగంగా మారింది. టీడీపీ హయాంలో పోలవరం 72 శాతం పూర్తయితే.. వైసీపీ హయాంలో కేవలం 3.84 శాతం పనులే జరిగాయి. పోలవరానికి కేంద్రం ఇచ్చిన నిధుల్లో రూ. 3,385 కోట్లు మళ్లించారు. టీడీపీ హయాంలో పోలవరం పనులకు ప్రశంసలు దక్కితే.. వైసీపీ హయాంలో పీపీఏ, ఐఐటీ నిపుణుల చీవాట్లు దక్కాయి. పోలవరం మరమ్మతుల కోసం అమెరికా, కెనడా నుంచి నిపుణుల్ని రప్పిస్తున్నాం. వాళ్లు ఇక్కడే ఉండి పర్యవేక్షిస్తారు. ఏజెన్సీని మార్చకపోతే 2020 నాటికే ప్రాజెక్టు పూర్తయ్యేది. జగన్ సర్కారు నిర్లక్ష్యంతో రూ. 4,900 కోట్ల నష్టం జరిగింది. ఖర్చు 38 శాతం పెరిగింది. ప్రభుత్వ నిర్లక్ష్యంతో విద్యుత్ ఉత్పత్తి కోల్పోయాం. దీని ద్వారా రూ. 3 వేల కోట్లు నష్టపోయాం. పోలవరం ఆలస్యంతో రైతులకు రూ. 45 వేల కోట్ల నష్టం జరిగింది” అని వివరించారు.

**ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలి**

మేధావులు నిపుణులు సహా అందరి సలహాలతోనే ముందుకు వెళతామని తెలిపారు. ఏది ఏమైనా ప్రజలు గెలవాలి.. రాష్ట్రం నిలబడాలని అన్నారు. మొత్తం ఏడు శ్వేత పత్రాలు విడుదల చేస్తున్నామని, దుష్ప్రచారాలకు చెక్ పెట్టేందుకే ఈ శ్వేత పత్రాలను విడుదల చేస్తున్నామని తెలిపారు. కేంద్రం నుంచి త్వరగా నిధులు తెచ్చుకోవాలని, 25 రోజుల్లో బడ్జెట్ ప్రవేశపెట్టాల్సిన అవసరం ఉందన్నారు. మరో 20-25 రోజుల్లో శ్వేత పత్రాలన్నీ విడుదల చేస్తామని, ఈ పత్రాలని వెబ్ సైట్ల ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంచుతామని చంద్రబాబు వెల్లడించారు.

**కేంద్రం తోడ్పాటుతో సవాళ్లు అధిగమిస్తాం..**

అంతర్జాతీయ, దేశీయ నిపుణుల సాయంతో సమస్యని అధిగమిస్తాం. కేంద్ర ప్రభుత్వ తోడ్పాటుతో సవాళ్లు అధిగమిస్తాం. ప్రాజెక్టు కట్టడం కంటే మరమ్మతు ఇంకా కష్టమైన పని. పోలవరం కోసం మేం పడిన శ్రమను జగన్ వృథా చేశారు. అర్హత లేనివారికి అధికారం వస్తే అరాచకాలే జరుగుతాయి. కాఫర్ డ్యామ్ ఎక్కడ ఉందో తెలియని వారు మాపై విమర్శలు చేశారు. పోలవరం ఎంతకాలంలో బాగు చేయగలమో నిపుణులే తేల్చాలి. జగన్ అరాచకంతో నిపుణులు కూడా భయపడే పరిస్థితి వచ్చింది. పోలవరంలో తప్పులు చేసిన అధికారుల్ని మారుస్తున్నాం. పోలవరంలో ప్రధాన దోషిని జనం ఇంటికి పంపారు. పోలవరం ఎత్తు విషయంలో రాజీ లేదు. అందరం సమష్టిగా పనిచేసి ప్రజలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నా” అని చంద్రబాబు అన్నారు.

## ఆంధ్రా యూనివర్సిటీని భ్రష్టుపట్టించారు : ఎమ్మెల్యే గంటా

**విశాఖపట్నం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఆంధ్రా యూనివర్సిటీ ప్రమాణాలను, ప్రతిష్టను వైసీపీ అధినేత, మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి దిగజార్చారని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు ట్విటర్ వేదికగా విమర్శించారు. వైస్ ఛాన్సలర్‌గా కరుడుగట్టిన వైసీపీవాది ప్రసాదరెడ్డిని నియమించి ఈ గడిచిన ఐదేళ్లలో యూనివర్సిటీ ప్రతిష్టను అమాంతం దిగజార్చారని విమర్శించారు. గాంధీ విగ్రహం పక్కనే వైఎస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహం పెట్టించి యూనివర్సిటీని ఒక రాజకీయపార్టీ కార్యాలయంగా మార్చేశారని ఫైర్ అయ్యారు. దేవాలయం లాంటి ఈ పవిత్రమైన విద్యాసంస్థను వైసీపీ ప్రభుత్వం ఒక ఫక్తు రాజకీయ కేంద్రంగా మార్చేశారని గంటా శ్రీనివాసరావు ఆరోపించారు.



ఆంధ్రా యూనివర్సిటీ అంటే ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు పేరు ఉండేదన్నారు. విద్యా ప్రమాణాల పరంగా ఎక్కడకు వెళ్ళినా ఆంధ్రా యూనివర్సిటీ పట్టా అంటే చాలా విలువనిచ్చే వాళ్లని.. ఇప్పుడు ఆంధ్రా యూనివర్సిటీ ప్రతిష్ఠను మసకబారేలా చేశారని గంటా శ్రీనివాసరావు విమర్శించారు. విద్యా ప్రమాణాలు పడిపోయాయని.. విద్యలో నాణ్యత ఎప్పుడూ లేనంతగా దిగజారినపోయేలా చేశారన్నారు. వైసీపీ ప్రభుత్వం నియమించిన వైస్ ఛాన్సలర్ ప్రసాదరెడ్డి.. వైస్ ఛాన్సలర్‌లా కాకుండా కరడు గట్టిన వైసీపీ నాయకుడిలా, రాజా రెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తూ యూనివర్సిటీని భ్రష్టు పట్టించాడని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో గౌరవ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సారథ్యంలో యూనివర్సిటీ కి పూర్వ వైభవం తీసుకొచ్చి.. దేశంలో నంబర్ వన్ యూనివర్సిటీగా తీర్చిదిద్దడం తథ్యమని గుర్తు పెట్టుకోవాలని జగన్‌కు గంటా శ్రీనివాసరావు సూచించారు.

## ఎన్నికలలో విధుల నిర్వహించిన సిబ్బందికి ఒక నెల జీతం బోనస్




**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్) :** ఇటీవల దేశంలో సార్వత్రిక ఎన్నికలు-2024 విజయవంతంగా ముగిశాయి. ఏడు దశల్లో లోక్ సభ ఎన్నికలు, నాలుగు రాష్ట్రాలకు అసెంబ్లీ ఎన్నికలు సజావుగా నిర్వహించారు. ఈ నేపథ్యంలో, సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించిన అధికారులు, సిబ్బందికి కేంద్ర ఎన్నికల సంఘం ఒక నెల గౌరవ వేతనం ప్రకటించింది. ఒక నెల గరిష్ఠ వేతనానికి సమానంగా గౌరవ వేతనం చెల్లించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారి (సీఈసీ) కార్యాలయం నుంచి ఉత్తర్వులు రాగా ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి (సీఈవో) ముఖేశ్ కుమార్ మీనా జిల్లాల కలెక్టర్లకు ఆ మేరకు ఆదేశాలు ఇచ్చారు.

# అప్రమత్తంగా ఉండండి

(మొదటి పేజీ తరువాయి)

**అమరావతి (జర్నలిస్ట్ ఫైల్):** ద్రోణి ప్రభావంతో గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రివర్యులు శ్రీమతి వంగలపూడి అనిత అధికారులను ఆదేశించారు. ఈ మేరకు శుక్రవారం విజయవాడలోని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ కార్యాలయంలో అధిక వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ.. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల నేపథ్యంలో అధికార యంత్రాంగం అలర్ట్‌గా ఉండాలన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని, సహాయక చర్యల కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేయాలన్నారు. ఐఎండి అంచనాల ప్రకారం నైరుతి రుతుపవనాల ప్రభావంతో సాధారణం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైయ్యే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. గోదావరి, కృష్ణా నదీ పరివాహక జిల్లాల్లో క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడూ వరద ప్రవాహాన్ని పరిశీలిస్తూ తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు.

జూన్ నెలలో ఇప్పటివరకు 12 జిల్లాల్లో అత్యధిక వర్షపాతం, 9 జిల్లాల్లో అధికం, 5 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదైందన్నారు. గురువారం ఉదయం నుంచి శుక్రవారం ఉదయంలోపు అల్లూరి సీతారామరాజు, శ్రీకాకుళం, కృష్ణా, విజయనగరం జిల్లాల్లో భారీ వర్షాలు నమోదైందన్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెం కొత్తవీధిలో అత్యధికంగా 184 మి.మీ అతిభారీ వర్షపాతం నమోదైందన్నారు. తరచూ వరదలు సంభవించే



నదీపరివాహక ప్రాంతాల్లో చెరువులు, వాగుల పరిస్థితిని ఎప్పటికప్పుడు పరిశీలించాలని చెప్పారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలు, సంభవించే వరదలపై కూడా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

**కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్..**

అధిక వర్షాల ప్రభావిత జిల్లాల కలెక్టర్లు, డీఆర్వోలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంత్రి అనిత సమీక్షించారు. తుఫాను ప్రభావంతో నదీపరివాహక ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలకు వాగుల ద్వారా గోదావరి, వంశధార, నాగావళి తదితర నదుల్లోకి వరద నీరు చేరుతోందని అన్నారు. వర్షాలు, వరదలపై ఇప్పటికే అల్లూరి సీతారామరాజు జిల్లాలో ఎల్లో అలర్ట్ జారీ చేశారన్నారు. ఈ సందర్భంగా అల్లూరి సీతారామరాజు కలెక్టర్ శ్రీ ఎ.ఎస్. దినేష్ కుమార్ మాట్లాడుతూ.. వారం రోజులుగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయన్నారు. వర్షాలు, తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో దేవీపట్నం నదీపరివాహక ప్రాంతంలో వీఆర్వో, వీఆర్ఏలతో పాటు ఇతర అధికారులు అప్రమత్తమై ముందస్తు చర్యలు కూడా తీసుకున్నారని తెలిపారు. దెబ్బతిన్న రహదారుల పునరుద్ధరణకు చర్యలు చేపట్టారని, సహాయక చర్యల నిమిత్తం గ్రీవెన్స్ సెల్ కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. డా.బి.ఆర్.అంబేద్కర్, శ్రీకాకుళం జిల్లా డీఆర్వోలు మాట్లాడుతూ.. అధిక వర్షాల నేపథ్యంలో అప్రమత్తమై ముందస్తు చర్యలు తీసుకున్నామని, ఎక్కడా కూడా ఎలాంటి సమస్యలు లేవని చెప్పారు. ఈ సందర్భంగా మంత్రి అనిత స్పందిస్తూ.. అధికారులు అలర్ట్‌గా ఉండాలని, ఎప్పటికప్పుడు పరిస్థితులను తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

రాష్ట్ర విపత్తుల నిర్వహణ శాఖ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ మాట్లాడుతూ.. భారీ వర్షాల వల్ల సంభవించే పరిస్థితులపై అధికారులంతా అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎగువ ప్రాంతాలైన నాసిక్, భద్రాచలం వంటి ప్రాంతాల్లో వర్షాలు, వరదల పరిస్థితులను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలన్నారు. గొట్టా బ్యారేజీ వంటి తదితర వరద ప్రభావిత ప్రాంతాల్లో తహశీల్దార్లు మరింత అప్రమత్తంగా ఉండాలన్నారు.

**ఏపీ ఎమర్జెన్సీ అలర్ట్ సెంటర్ పరిశీలన..**

స్టేట్ ఎమర్జెన్సీ ఆపరేషన్ సెంటర్ ను మంత్రి అనిత స్వయంగా పరిశీలించగా 24/7 వాతావరణాన్ని పర్యవేక్షించే విధానాన్ని అధికారులు మంత్రికి వివరించారు. వాతావరణ పరిశోధన విభాగాలలోని వివిధ అంశాలను తెలిపారు. అత్యవసర సహాయక చర్యల కోసం ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విపత్తుల సమయంలో నిరంతరం పర్యవేక్షిస్తూ అలర్ట్స్ పంపే విధానాన్ని అధికారులు మంత్రికి విశదీకరించారు. కామన్ అలెర్ట్ ప్రోటోకాల్ , ఏపీ అలెర్ట్ సెంటర్ ద్వారా ప్రజలకు హెచ్చరిక సందేశాలు ఏవిధంగా చేరుతాయో ప్రత్యక్షంగా చూపించారు. కమ్యూనికేషన్ వ్యవస్థ దెబ్బతిన్నప్పుడు వినియోగించే శాటిలైట్ ఫోన్స్, శాటిలైట్ బేస్డ్ మొబైల్ డేటా వాయిస్ టెర్మినల్ , వాకీటాకీ, వి-శాట్ కమ్యూనికేషన్ వ్యవస్థల గురించి మంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా.. విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు, సిబ్బంది పనితీరును మంత్రి ప్రశంసించారు.

అనంతరం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెడికల్ క్యాంపును మంత్రి అనిత ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విపత్తుల నిర్వహణ శాఖ ఈడీ సి.నాగరాజు, సంస్థ అధికారులు, తదితర సిబ్బంది పాల్గొన్నారు

# తెలంగాణా వార్తలు

## పార్టీ మారాలని కాంగ్రెస్ నాయకులు ప్రలోభాలకు గురిచేస్తున్నారు



**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** సీఎం రేవంత్ రెడ్డి గేట్లు ఓపెన్ చేస్తే.. తమకు సుప్రీం కోర్టు గేట్లు ఉన్నాయని మాజీ మంత్రి జగదీష్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్ లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశంలో పార్టీ ఫిరాయింపులు మొదలు పెట్టిందే కాంగ్రెస్ పార్టీ అని సీరియస్ అయ్యారు. ఫిరాయింపుల నిరోధక చట్టం తెచ్చింది కూడా కాంగ్రెస్ పార్టీయే అన్నారు. కాంగ్రెస్ గురివింద గింజ వైఖరి అని మండిపడ్డారు. చంద్రబాబు లాంటి తెలంగాణ వ్యతిరేక నాయకుల సంకలో రేవంత్ ఉన్నారని తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు.

కాంగ్రెస్ నాయకులు పార్టీ మారాలని రాత్రిళ్ళు ఇంటింటికీ తిరిగి ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాట్లాడేటప్పుడు సోయి ఉండి మాట్లాడాలని హితవు పలికారు. రాత్రికి రాత్రి కి వెళ్లి కండువాలు కప్పుతున్నది రేవంత్ రెడ్డి కాదా అన్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టం తెచ్చిందే కాంగ్రెస్ అన్నారు. దేశంలో జరుగుతున్న అనర్థాలకు ఆ పార్టీయే కారణం అన్నారు. నాడు 12 మంది కాంగ్రెస్ ఎమ్మెల్యేలు చేరింది ఆ పార్టీ సిద్ధాంతాలు నచ్చకనే అని తేల్చిచెప్పారు.

## నల్లగొండ డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై నెగ్గిన అవిశ్వాస తీర్మానం



**నల్గొండ (జర్నలిస్ట్ ఫైల్):** ఉమ్మడి నల్లగొండ జిల్లా డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్ రెడ్డిపై డైరెక్టర్లు పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గింది. బీఆర్ఎస్ పార్టీకి చెందిన గొంగిడి మహేందర్ రెడ్డిని చైర్మన్ పదవి నుంచి తొలగించాలని కోరుతూ 14 మంది డైరెక్టర్లు కొద్దిరోజుల క్రితం డీసీఓ కిరణ్ కుమార్ కు అవిశ్వాస తీర్మానాన్ని ఇచ్చారు.

డైరెక్టర్లు ఇచ్చిన అవిశ్వాస తీర్మానం మేరకు శుక్రవారం ఉదయం 11 గంటలకు నల్లగొండ డీసీసీబీ కార్యాలయంలో అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహించగా 15 మంది డైరెక్టర్లు మహేందర్ రెడ్డికి వ్యతిరేకంగా ఓటు వేశారు. దీంతో మహేందర్ రెడ్డి పదవి కోల్పోయినట్లు అయింది. నూతన చైర్మన్ ఎంపిక కోసం త్వరలో ఓటింగ్ నిర్వహించనున్నట్లు డీసీఓ తెలిపారు.

నూతన చైర్మన్ గా శ్రీనివాస్ రెడ్డి : నల్లగొండ జిల్లా నూతన డీసీసీబీ చైర్మన్ గా కాంగ్రెస్ పార్టీకి చెందిన శ్రీనివాస్ రెడ్డి నియామకం కానున్నారు.

# దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి.. మన పీవీ





**హైదరాబాద్(జర్నలిస్ట్ ఫైల్):** తెలంగాణ భవన్‌లో భారతరత్న, మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మాజీ ప్రధాని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ సురభి వాణీదేవి, మాజీ మంత్రులు జగదీష్ రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్సీలు, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.

**బహుముఖ ప్రజ్ఞాశాలి :** బహుముఖ ప్రజ్ఞాశాలి, బహుభాషాకోవిదుడు, దేశ ఆర్థిక సంస్కరణల రూపశిల్పి, తెలంగాణ ఖ్యాతిని ఖండాంతరాలకు చాటిన మహా మేధావి, భారత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు అని బీఆర్ ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ కొనియాడారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా దేశానికి ఆయన అందించిన సేవలను స్మరించుకున్నారు. నాటి ప్రపంచ ఆర్థిక విధానాలకు అనుగుణంగా సంస్కరణలు చేపట్టి దేశ ఆర్థిక స్థితిని చక్కదిద్దిన దార్శనికుడు, భారతజాతి ముద్దుబిడ్డ పీవీ అన్నారు. తెలంగాణ బిడ్డగా మనందరం గర్వపడాల్సిన పీవీ నరసింహారావు అందించిన స్ఫూర్తి మరువలేనిదని తెలిపారు.

**మౌనముని అయినా.. మరుపురాని సేవలు..**

మౌనమునిగా పేరుగాంచిన పీవీ నరసింహారావు.. దేశానికి ఎనలేని సేవలు చేసినప్పటికీ కాంగ్రెస్ పాలకులు ఆయనను విస్మరించారని కేసీఆర్ అన్నారు. తెలంగాణ ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ ప్రభుత్వం పీవీకి సముచిత గౌరవాన్నిచ్చిందని, ఆయన ఖ్యాతిని యావత్తు దేశానికి, ప్రపంచానికి చాటేందుకు ఎనలేని కృషి చేశామని చెప్పారు.

## అధికారిపై దాడి.. రవాణా శాఖ అధికారుల పెన్ డౌన్



**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** రాష్ట్ర వ్యాప్తంగా రవాణా శాఖ అధికారులు పెన్ డౌన్ పాటిస్తున్నారు. నిన్న ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయంలో జేటీసీ రమేశ్ పై ఆటో యూనియన్ నేత దాడికి పాల్పడిన ఘటనకు నిరసనగా ఈ నిర్ణయం తీసుకున్నారు. తను అడిగిన పని చేయడం కుదరదని జేటీసీ రమేశ్ కుమార్ చెప్పడంతో గురువారం అమానుల్లాఖాన్ జేటీసీని చెంపదెబ్బ కొట్టారు. దీనికి నిరసనగా శుక్రవారం రవాణా శాఖ ఉద్యోగులు నిరసనకు దిగారు. నిందితుడిని శిక్షించాలని డిమాండ్ చేశారు. అయితే రవాణా శాఖ కమిషనర్ తో చర్చల అనంతరం పెన్ డౌన్ ఆలోచన విరమించుకుని నల్లరిబ్బన్లు ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ.. భౌతిక దాడులు సరికావని ఆగ్రహం వ్యక్తం చేశారు. మరోవైపు దాడికి పాల్పడిన అమానుల్లాఖాన్ ను పోలీసులు అరెస్టు చేసి జైలుకుతరలించారు.

# చివరి దశకు టీపీసీసీ చీఫ్ కసరత్తు !

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** తెలంగాణ పిసిసి కొత్త అధ్యక్షుడి నియామక కసరత్తు చివరి అంకానికి చేరుకుంది. కొత్త అధ్యక్షుడి ఎంపికపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఢిల్లీలో ఉన్న సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూట సీఎం భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంఛార్జి దీపాదాస్ మున్షీ లతో చర్చిస్తున్నారు తెలంగాణ కాంగ్రెస్ అధ్యక్ష బాధ్యతలను ఎవరికి అప్పగించాలనే అనే అంశంపై ఇప్పటికే పార్టీ నేతలతో విస్తృతంగా సంప్రదింపులు జరిపిన ఏఐసీసీ పెద్దలు పలువురి పేర్లను షార్ట్ లిస్ట్ చేసింది.

పిసిపి పదవి రేసులో మహేష్ కుమార్ గౌడ్, మధుయాష్కిలో ఉన్నట్లు సమాచారం.. సామాజిక సమీకరణాలతో పాటు సీనియార్టీ, సమగ్రవంతమైన నాయకుడికి పార్టీ రాష్ట్ర అధ్యక్ష బాధ్యతలు కట్టబెట్టాలని అధిష్ఠానం నిర్ణయించినట్లు తెలుస్తోంది. అయితే.. ఇవాళ కొత్త పీసీసీ పేరు ఖరారు అవుతుందా లేదా ఇంకా టైమ్ పడుతుందా అనేది సస్పెన్స్ గా మారింది.

**మంత్రివర్గ విస్తరణపై కూడా..**

అలాగే మరోవైపు మంత్రివర్గ విస్తరణపై కూడా కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. నామినేటెడ్ పోస్టులను త్వరగా భర్తీ చేసే యోచనలో ఉంది. . ఇక.. హస్తినలోనే ఉన్న ముఖ్య నేతలు ఎవరెవరికి ఏఏ పదవులు ఇవ్వాలన్న దానిపై చర్చలు జరుపుతున్నారు. కేబినెట్ లో ఒకేసారి ఆరు మంత్రి పదవులు భర్తీ చేయాలా.. లేదా కొన్నింటిని పెండింగ్ లో ఉంచాలా అన్న దానిపై మంతనాలు సాగుతున్నాయి. ఇక.. మంత్రి మండలి కూర్పు, కాంగ్రెస్ లో చేరికల అంశం భేటీలో చర్చకు వచ్చినట్లు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారు. పార్టీలో మొదటి నుంచి ఉన్నవాళ్లకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించామని తెలిపారు.



## బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ.. కాంగ్రెస్ పార్టీలో చేరిన ఎమ్మెల్యే కాలె యాదయ్య

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో ఘోర పరాభవాన్ని ఎదుర్కొన్న బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు ఒక్కొక్కరుగా కాంగ్రెస్ పార్టీలో చేరుతూ అధినేత కేసీఆర్కు వరసగా షాకులిస్తున్నారు. ఈ క్రమంలోనే శుక్రవారం చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఢిల్లీకి వెళ్లి ఏఐసీసీ నేతలు, సీఎం రేవంత్రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు.

# కేసీఆర్ పిటిషన్‌పై హైకోర్టులో ముగిసిన వాదనలు - తీర్పు రిజర్వ్

**హైదరాబాద్( జర్నలిస్ట్ ఫైల్ ) :** సీఎం కేసీఆర్ హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం వాదనలు ముగిశాయి. విద్యుత్ కమిషన్ ఏర్పాటు జీవోను కొట్టివేయాలని మాజీ సీఎం కేసీఆర్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి జారీ చేసిన నోటీసులు రద్దు చేయాలని పిటిషన్‌లో కోర్టును కోరారు. కాగా, విద్యుత్ కమిషన్ చైర్మన్ ఏకపక్ష ధోరణితో వ్యవహరించలేదని ఏజీ పేర్కొన్నారు. కేసీఆర్ పిటిషన్‌కు విచారణ అర్హత ఉందా లేదా అనే దానిపై వాదనలు ముగిశాయి. అనంతరం కేసీఆర్ పిటిషన్‌పై తీర్పు రిజర్వ్ చేసినట్లు హైకోర్టు తెలిపింది.

**విచారణ చేపట్టిన ద్విసభ్య ధర్మాసనం..**

విద్యుత్తు కొనుగోళ్లు, థర్మల్ ప్లాంట్ల నిర్మాణంపై జస్టిస్ ఎల్. నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘం ఏర్పాటును సవాల్ చేస్తూ కేసీఆర్ దాఖలు చేసిన పిటిషన్‌కు నంబర్ కేటాయించాలని హైకోర్టు నిర్ణయించింది. ఈ మేరకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ జూకంటి అనిల్‌కుమార్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం హైకోర్టు రిజిస్ట్రీకి ఆదేశాలు జారీచేసింది. విద్యుత్తు వ్యవహారాలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాది మార్చి 14న జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి నేతృత్వంలో విచారణ సంఘాన్ని నియమించింది. యాదాద్రి, భద్రాద్రి థర్మల్ విద్యుత్తు కేంద్రాల నిర్మాణం, ఛత్తీస్‌గఢ్-తెలంగాణ మధ్య విద్యుత్తు కొనుగోలు ఒప్పందాల్లో అక్రమాలు జరిగాయని ప్రభుత్వం ఆరోపించింది. కమిషన్ ఏర్పాటు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ కేసీఆర్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. విద్యుత్తుశాఖ ముఖ్య కార్యదర్శిని, జస్టిస్ ఎల్ నరసింహారెడ్డి విచారణ సంఘాన్ని, వ్యక్తిగత హోదాలో జస్టిస్ ఎల్ నరసింహారెడ్డిని ఇందులో ప్రతివాదులుగా పేర్కొన్నారు.

**అభ్యంతరం తెలిపిన రిజిస్ట్రీ..**

అయితే.. జస్టిస్ నరసింహారెడ్డిని ప్రతివాదిగా చేర్చడంపై హైకోర్టు రిజిస్ట్రీ అభ్యంతరం తెలిపారు. నంబర్ కేటాయించేందుకు నిరాకరించారు. ఈ నేపథ్యంలో కేసీఆర్ పిటిషన్ హైకోర్టు ధర్మాసనం ముందుకు వచ్చింది. దాదాపు 45 నిమిషాలపాటు వాదప్రతివాదనలు జరిగాయి. కేసీఆర్ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ఆదిత్య సోంధి బలంగా వాదనలు వినిపించారు. ఆయనతో ఏకీభవించిన ధర్మాసనం.. హైకోర్టు రిజిస్ట్రీ లేవనెత్తిన అభ్యంతరాలను తోసిపుచ్చింది. పిటిషన్‌కు నంబర్‌ను కేటాయించాలని ఆదేశించింది. జస్టిస్ నరసింహారెడ్డి ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారంటూ పిటిషనర్ అభియోగాలు మోపిన నేపథ్యంలో, పిటిషన్‌పై నేడు వాదనలు పూర్తికాగా, తీర్పును రిజర్వ్ చేసింది ధర్మాసనం

## సభలో రాహుల్ గాంధీ మైక్ మ్యూట్ చేశారు.. కాంగ్రెస్ ఆరోపణలు



**ఢిల్లీ:** పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో 'నీట్ పేపర్ లీక్' వ్యవహారంపై చర్చ జరపాలని విపక్షాలు డిమాండ్ చేయడంతో ఉభయ సభలు వాయిదా పడ్డాయి. దానికిముందు లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఈ అంశం లేవనెత్తగానే మైక్ ఆపేశారని కాంగ్రెస్ ఆరోపించింది. ఈమేరకు ఎక్స్ (ట్విటర్) వేదికగా ఒక వీడియోను షేర్ చేసింది. మైక్రోఫోన్‌లో మాట్లాడేందుకు వీలు కల్పించాలంటూ స్పీకర్ ఓం బిర్లాను రాహుల్ కోరడం ఆ దృశ్యాల్లో కనిపిస్తోంది.

"నీట్‌పై ప్రధాని మోదీ ఏం మాట్లాడటం లేదు. సభలో యువత తరఫున రాహుల్ తన గొంతు వినిపిస్తున్నారు. కానీ అలాంటి తీవ్రమైన అంశంలో కూడా మైక్ ఆఫ్ చేయడం వంటి చౌకబారు పనులకు పాల్పడి, యువత గొంతు నొక్కేందుకు కుట్ర చేస్తున్నారు" అంటూ కాంగ్రెస్ తన ఖాతాల్లో రాసుకొచ్చింది. తాను ఎంపీల మైక్రోఫోన్ స్విచ్ఛాఫ్ చేయనని, అలాంటి నియంత్రణ ఏదీ తన వద్ద లేదని స్పీకర్ స్పష్టంచేశారు. రాష్ట్రపతి ప్రసంగంపై చర్చ జరగాల్సిన సమయంలో ఇతర విషయాలు రికార్డు కావని వెల్లడించారు. నీట్ వివాదంపై చర్చ జరగాలని, దీనిపై కేంద్రం ప్రకటన చేయాలని రాహుల్ డిమాండ్ చేశారు. "నీట్ పేపర్ లీక్ సమస్య.. దేశ యువతకు సంబంధించిన కీలకమైన అంశం. దానిపై సభలో అర్థవంతమైన, గౌరవప్రదమైన చర్చను ప్రధాని మోదీ చేపట్టాలి. విద్యార్థుల సమస్యలపై ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి పనిచేస్తోందనే సందేశాన్ని పార్లమెంట్ ఇవ్వాలి" అని మీడియాతో మాట్లాడుతూ అన్నారు.

## ఢిల్లీ - ఎన్‌సిఆర్ 88 ఏళ్ల తర్వాత రికార్డు స్థాయి వర్షపాతం

**న్యూఢిల్లీ :** ఢిల్లీ - ఎన్‌సిఆర్ పరిధిలో గురువారం నుండి భారీ వర్షాలు కురుస్తున్నాయి. 88 ఏళ్ల తర్వాత ఢిల్లీలో రికార్డు వర్షపాతం నమోదైనట్లు అధికారులు తెలిపారు. రహదారులు జలమయమవడంతో.. ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో గత కొన్ని రోజులుగా గరిష్ట ఉష్ణోగ్రతలు, ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి అయిన ఢిల్లీ ప్రజలు వర్షాలతో తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అయితే ఈ వర్షాలు తీవ్రమైన వేడి నుండి ఉపశమనం కలిగించాయి. శుక్రవారం ఉదయం కనిష్ట ఉష్ణోగ్రత సాధారణం కంటే 3.2 డిగ్రీలు తక్కువగా 24.7 డిగ్రీలుగా నమోదైంది.

గురువారం ఉదయం 8.30 నుండి శుక్రవారం ఉదయం 8.30 వరకు ఢిల్లీలో 228 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వాతావరణ శాఖ (ఐఎండి) తెలిపింది. గత 24 గంటల్లో కురిసిన వర్షం 1936 జూన్‌లో 235.5 మి.మీ వర్షపాతం తర్వాత రికార్డు వర్షపాతం ఇదేనని పేర్కొంది. ఈ నెల ఢిల్లీలో సగటున 80.6 మి.మీ వర్షపాతం నమోదైంది.

# తమిళనాడు అసెంబ్లీలో నీట్ పరీక్ష రద్దుపై ఏకగ్రీవ తీర్మానం



**చెన్నై :** నీట్ పరీక్షకు వ్యతిరేకంగా తమిళనాడు అసెంబ్లీ ఏకగ్రీవంగా తీర్మానాన్ని ఆమోదించింది. నీట్ రద్దు చేయాలని డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. నీట్ స్థానంలో గతంలోమాదిరిగానే పన్నెండో తరగతి మార్కుల ఆధారంగా మెడికల్ కాలేజీల్లో అడ్మిషన్లు చేపట్టేందుకు అనుమతివ్వాలని కేంద్రాన్ని కోరారు. మణితనేయ మక్కల్ కట్చి, ఎండీఎంకే, తమిళగ వెట్రి కజగం, సీపీఎం సహా పలు ప్రాంతీయ పార్టీలు ఈ తీర్మానానికి మద్దతు పలికాయి. నీట్ పేపర్ లీకేజీ, నీట్ పీజీ పరీక్షను వాయిదా వేశారనే అంశాలను సీఎం స్టాలిన్ అసెంబ్లీలో ప్రస్తావించారు.

**నీట్ అంశంపై డీఎంకే ఎంపీ ఏమన్నారంటే?**

అంతకుముందు, నీట్ నుంచి తమిళనాడుకు "మినహాయింపు" ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నట్లు డీఎంకే ఎంపీ కనిమొళి అన్నారు. ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. నీట్ను రద్దు చేయాలని కోరుతున్నామని.. ఇప్పటికే తమిళనాడు అసెంబ్లీలో తీర్మానం చేశామని పేర్కొన్నారు. రాష్ట్రపతి సంతకం కోసం వేచిచూస్తున్నట్లు తెలిపారు.

# ఢిల్లీ విమానాశ్రయంలోని కూలిన పైకప్పు



**ఢిల్లీ :** ఢిల్లీ విమానాశ్రయంలోని పైకప్పు కూలిన ఘటనలో ఒకరు మృతి చెందగా ఆరుగురు గాయపడ్డారు. శుక్రవారం తెల్లవారుజామున కురుస్తున్న భారీ వర్షాల మధ్య ఢిల్లీ విమానాశ్రయంలోని టెర్మినల్-1 పైకప్పులోని కొంత భాగం ట్యాక్సీలు, కార్లపై పడటంతో ఆరుగురు గాయపడ్డారని ఢిల్లీ ఫైర్ సర్వీసెస్ అధికారులు తెలిపారు. ధ్వంసమైన వాహనాల్లో మరెవరూ చిక్కుకోకుండా సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పైకప్పు షీట్‌తో పాటు, సపోర్టు బీమ్‌లు కూడా కూలిపోయాయని, టెర్మినల్‌లోని పిక్-అప్ మరియు డ్రాప్ ప్రాంతంలో పార్క్ చేసిన కార్లు దెబ్బతిన్నాయని అధికారులు తెలిపారు. క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించినట్లు వారు తెలిపారు. ఆరుగురిలో ఇనుప పుంజం పడిపోయిన కారు నుండి ఒకరిని రక్షించినట్లు అధికారులు తెలిపారు. ఉదయం 5:30 గంటల ప్రాంతంలో డిఎఫ్ఎస్‌కి సంఘటన గురించి కాల్ రావడంతో మూడు ఫైర్ టెండర్లను విమానాశ్రయానికి పంపారు. ఈ ఘటనపై పౌర విమానయాన శాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడు స్పందిస్తూ ఎక్స్ లో ఒక పోస్ట్ చేశారు. పరిస్థితిని స్వయంగా పర్యవేక్షిస్తున్నారని, గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారని చెప్పారు. "టి1 ఢిల్లీ ఎయిర్‌పోర్ట్‌లో పైకప్పు కూలిన సంఘటనను వ్యక్తిగతంగా పర్యవేక్షిస్తున్నారు. మొదట స్పందించినవారు సైట్‌లో పని చేస్తున్నారు. అలాగే టి1 వద్ద బాధిత ప్రయాణీకులందరికీ సహాయం చేయమని విమానయాన సంస్థలకు సలహా ఇచ్చారు.

గాయపడిన వారిని ఆసుపత్రికి తరలించారు. రెస్క్యూ కార్యకలాపాలు ఇంకా కొనసాగుతున్నాయి," అని ఆయన పేర్కొన్నారు. ఘటనా స్థలికి చేరుకున్న పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు మృతుల కుటుంబాలకు 20 లక్షలు, గాయపడిన వారికి ? 3 లక్షల పరిహారంను ప్రకటించారు.

# జాతీయ వార్తలు

## రామ మందిరం పై కప్పు లీకేజీ వార్తలను ఖండించిన ఆలయ ట్రస్ట్



**ఢిల్లీ :** బాబ్రీ మసీదు ధ్వంసం చేసిన భూమిలో నిర్మించిన అయోధ్యలోని రామాలయంలో లీకేజీ జరిగిందని వెల్లడించిన ప్రధాన అర్చకుని వ్యాఖ్యలను ఆలయ ట్రస్ట్ తిరస్కరించింది. ఆచార్య సత్యేంద్రదాస్ ఆరోపణలో నిజం లేదని రామమందిర్ మేనేజ్‌మెంట్ ట్రస్ట్ చైర్ పర్సన్ నృపేంద్ర మిశ్రా అన్నారు. పైకప్పు లీకేజీ కాదని పైప్‌లోంచి నీరు పడిందని వివరణ ఇచ్చారు. రెండో అంతస్తు పనులు పూర్తయితే లీకేజీ ఆగుతుందని కూడా చెబుతున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు జనవరి 22న అసంపూర్తిగా ఉన్న రామమందిరాన్ని ప్రధాని ప్రారంభించిన విషయం విదితమే.

## కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం..13 మంది మృతి

**బెంగళూరు:** కర్ణాటకలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతి చెందారు. కర్ణాటకలోని హావేరి వద్ద మినీ బస్సు ట్రక్కును ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. శివమొగ నుంచి వచ్చిన యాత్రికులు ప్రమాదానికి గురయ్యారు. ఆగి ఉన్న ట్రక్కును మినీ బస్సు ఢీకొన్నది. మృతులలో 9 మంది మహిళలు, ఇద్దరు పురుషులు, ఇద్దరు చిన్నారులు ఉన్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



# సివిల్ సప్లైస్ అధికారులపై మంత్రి నాదెండ్ల ఆగ్రహం

## పిడిఎస్ రైస్ అక్రమ రవాణా పై అధికారులు ఏం చేస్తున్నారంటూ నిలదీత



**కాకినాడ ( జర్నలిస్ట్ ఫైల్ ):** పిడిఎస్ రైస్ అక్రమంగా రవాణా జరుగుతున్నా సంబంధిత అధికారులు ఏం చేస్తున్నారంటూ పౌర సరఫరాల శాఖమంత్రి నాదెండ్ల మనోహర్ ప్రశ్నించారు.. గత పది రోజులుగా పీడీఎస్ రైస్ ఎక్కువ మూమెంట్ అవుతుందని అంటూ ఎందుకు రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేయడం లేదని నిలదీశారు. కాకినాడలో ఆయన నేడు తన శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.. అక్రమ రవాణ అరికట్టేందుకు వెంటనే జేసీ రంగంలోకి దిగాలని ఆదేశాలు జారీ చేశారు.

ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ రాం సుందర్ రెడ్డిపై మంత్రి సీరియస్ అయ్యారు. రేషన్ తీసుకోవడానికి సిద్దంగా ఉన్న ఎందుకు డిస్ట్రిబ్యూట్ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. డేట్ తో సంబంధం ఏమి ఉందని ప్రశ్నించారు.. ఎన్నికలు ముగిసిన అధికారులు స్లీప్ మోడ్ లో ఉంటున్నారని సమాధానం చెప్పడంతో అదేం సమాధానం అంటూ జెసీపై ఫైర్ అయ్యారు. ఇక . కొత్త రేషన్ కార్డులు కోసం డేటా తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు..

కౌలు రైతుల విషయంలో విపక్ష చూపించారంటూ.. చట్టంలో మార్పు తీసుకుని వస్తామన్నారు మంత్రి.. వ్యవస్థాపరమైన లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. రాబోయే రోజుల్లో మిల్లెట్స్ పంటలు ను ఎంకరేజ్ చేస్తామన్నారు. రేషన్ సరుకులు అంగన్ వాడీలు, రెసిడెన్షియల్ హాస్టల్ లలో కనిపిస్తున్నాయని, దీనిపై గత మూడు నెలల్లో ఎక్కడ కేసులు పెట్టకపోవడం ఏమిటని అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు నాదెండ్ల . అసలు హాస్టల్స్ లో ఎందుకు తనిఖీలు చేయడం లేదని సివిల్ సప్లై శాఖ మంత్రి ప్రశ్నించారు.

## ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన మంత్రి సుభాష్



**కోనసీమ , రామచంద్రపురం ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ప్రభుత్వం పాఠశాలలో అమలుచేస్తున్న మధ్యాహ్న భోజనం పథకాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తాళ్లపాలెం ప్రభుత్వం పాఠశాలలో ఆయన విద్యార్థులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన విద్యార్థులను భోజనం ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. అంతటితో ఆగకుండా ఆయనే స్వయంగా ప్లేట్ తీసుకొని మధ్యాహ్నం భోజనం రుచి చూశారు. అనంతరం ఇక్కడ పారిశుధ్యం పైన ఆరా తీశారు. పరిసరాలను పరిశుభ్రతను పాటించాలని, మెరుగైన ఆహారం విద్య విద్యార్థులకు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. అనంతరం రామచంద్రపురం జూనియర్ కళాశాల ను, పాలిటెక్నిక్ కళాశాలను ఆకస్మిక తనిఖీలను నిర్వహించారు. అదేవిధంగా తాగునీరు శుభ్రత కూడా పరిశీలించారు. ప్రస్తుత వర్షాకాలంలో తాగునీటి పైన ప్రత్యేక తీసుకోవాలని ఆయన సూచించారు. ఆయన వెంట పలువురు తెలుగుదేశం పార్టీ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## దేశానికే ఠీవీ - మాజీ ప్రధాని పీవీ

**• కార్పొరేటర్ ఈచంపాటి**



**గుంటూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** ఒక మనిషిలో ఎన్ని గుణాలు.. ఒక రాజకీయవేత్తలో ఎన్నెన్ని కోణాలు.. ఒక పాలకుడిలో మరెన్ని సుగుణాలు ఉండాలో అన్నన్నీ సమపాళ్ళలో ఉన్న విలక్షణమైన వ్యక్తిత్వం, విజ్ఞానంతో కూడిన తేజస్సు, విశిష్టమైన యశస్సు మన మాజీ ప్రధాని పీవీ నరసింహారావు సొంతమని కార్పొరేటర్ ఈచంపాటి వెంకటకృష్ణ (ఆచారి) కొనియాడారు. అందుకే పీవీ మన దేశానికే ఠీవీ అని ఆయన వ్యాఖ్యానించారు.

మాజీ ప్రధాని, భారతరత్న పీవీ నరసింహారావు 103వ జయంతి వేడుకలు గుంటూరులో శుక్రవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బ్రాడీపేట మెయిన్ రోడ్డులోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం ఎదుట గల పీవీ విగ్రహానికి పలువురు నేతలు పూలమాలలు వేసి ఆయనకు ఘనంగా నివాళులు అర్పించారు.

అనంతరం ఆచారి మాట్లాడుతూ, రాజకీయ చతురుడు.. రాజీ పడని అపర చాణక్యుడు.. రాజనీతి కోవిదుడు.. తాత్వికుడు.. సాత్వికుడు.. అన్నిటినీ మించి పదహారణాల తెలుగువాడు మన పాములపర్తి వెంకట నరసింహారావు అని కీర్తించారు. మాజీ ముఖ్యమంత్రిగా ఇటు ఆంధ్రప్రదేశ్, మాజీ ప్రధానిగా అటు భారతదేశం ప్రయోజనాలు కాపాడడంలో క్రియాశీలకంగా వ్యవహరించిన రాజకీయ కోవిదుడు పీవీ నరసింహారావు అని వ్యాఖ్యానించారు. బ్రాహ్మణ జాతి మాత్రమే కాక యావత్ భారత జాతి గర్వించదగ్గ మేధావిగా ఆయనను అభివర్ణించారు.

కార్యక్రమంలో శ్యాంసుందర్, నారాయణ, పరశురామ బ్రాహ్మణ సంఘం అధ్యక్షురాలు కప్పగంతుల ఆదిలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బోనులో చిక్కిన చిరుత.. మేకను ఎరగా వేసి..



**కర్నూల్ ( జర్నలిస్ట్ ఫైల్ ):** ఉమ్మడి కర్నూలు జిల్లా మహానంది పరిధిలోని పచ్చర్ల గ్రామస్తులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న చిరుత ఎట్టకేలకు అటవీశాఖ ఉచ్చులో చిక్కింది. పచ్చర్ల అటవీ ప్రాంతంలో గత వారం రోజులుగా సాధారణ ప్రజలపై దాడికి దిగుతున్న చిరుత ఇక్కడి ప్రజలను ఆందోళనకు గురిచేసింది. ముఖ్యంగా మూడు రోజుల క్రితం పచ్చర్ల గ్రామానికి చెందిన మాజీ ఉపసర్పంచ్ మెహరున్నీసా అనే మహిళ వంట చెరుకు కోసం అడవిలోకి వెళ్లగా ఆమెపై దాడి చేసి చంపేసింది. ఆమెతో పాటు మరో ఇద్దరిపైనా కూడా దాడి చేసింది.

చిరుత వరుస దాడులతో బెంబేలెత్తిన గ్రామస్తులు గిద్దలూరు చిరుతను బంధించాలని హైవే రోడ్డును దిగ్బంధించి నిరసనలు చేపట్టారు. ఈ క్రమంలో హై అలర్ట్ అయిన అధికారులు నల్లమల పచ్చర్ల చెక్ పోస్ట్ వద్ద బోను ఏర్పాటు చేశారు. ఎట్టకేలకు అటవీ అధికారుల ఉచ్చుకు చిరుత బోనులో చిక్కింది. మేకను ఎరగా వేసి బోనులో బంధించారు. చిరుత పట్టుబడటంతో గ్రామస్థులు, అధికారులు ఊపిరి పీల్చుకున్నారు.

అయితే, బోనులో చిక్కిన చిరుత, మెహరూన్ పై దాడి చేసిన చిరుత ఒక్కటేనా లేదంటే ఇంకో చిరుతనా అన్న అనుమానం అటవీశాఖ అధికారులకు కలుగుతోంది. ప్రస్తుతం పట్టుబడిన చిరుత వయస్సు 5 నుండి 6 సంవత్సరాలు ఉంటుందని అటవీ అధికారులు వెల్లడించారు. పచ్చర్ల వద్ద బోనులో చిక్కిన చిరుతను తిరుపతి జూపార్క్ కు తరలించనున్నట్లు అటవీ శాఖ అధికారులు వెల్లడించారు.

## జూలై 1వ తేదీన ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ సజావుగా నిర్వహిస్తాం

**• కలెక్టర్ పి.ప్రశాంతి**



**రాజమహేంద్రవరం ( జర్నలిస్ట్ ఫైల్ ):** ప్రభుత్వ ప్రాధాన్యత పథకాలను చివరి లబ్ధిదారుని వరకు అందించాలన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ దిశగా జిల్లాలో ప్రభుత్వ అమలు చేస్తున్న కార్యక్రమాలను వేగవంతంగా ప్రజలకు చేరవేయటం జరుగుతుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి తెలిపారు. శుక్రవారం తూర్పుగోదావరి జిల్లా కలెక్టరేట్ లో జాయింట్ కలెక్టర్ ఎన్.తేజ్ భరత్ తో కలిసి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ %ా% ప్రభుత్వ ప్రాధాన్యతహెుపథకాలను చిట్టచివరి లబ్ధిదారుని వరకు అందించాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. ఆ మేరకు జిల్లాలో అన్ని శాఖల అధికారులు వారి వారి కార్యకలాపాలను సమర్ధవంతంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అందరితో సమన్వయం చేసుకుంటూ, క్షేత్ర స్థాయిలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా పరిష్కరించడం జరుగుతుందన్నారు. ఈరోజు జాయింట్ కలెక్టర్ తేజ్ భరత్ నుండి జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించామన్నారు. జులై 1వ తేదీన ఎక్కడ ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఎన్టీఆర్ భరోసా పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు కార్యాచరణతో పటిష్టమైన చర్యలు చేపట్టమన్నారు. ఎక్కువ మొత్తంలో పెన్షన్ లబ్ధిదారులకు పంపిణి చేయాల్సి ఉంటుందని, అందిస్తున్న సదరు మొత్తాన్ని రెండు మూడు క్లస్టర్లు ద్వారా మ్యాపింగ్ చేయడం జరుగుతుందన్నారు. జులై ఒకటో తేదీ ఉదయం 6 గంటల నుండి సచివాలయ, ప్రభుత్వ ఉద్యోగులతో పెన్షన్ పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తాగునీరు శానిటేషన్ పై ప్రత్యేక దఅష్టి సారిస్తామన్నారు. ఇప్పటికే జిల్లాలో డయేరియా కేసులు నమోదు కాకుండా అధికారుల కార్యచరణ అమలు చేస్తున్నట్లు కలెక్టర్ వివరించారు.

## కర్నూలును అన్ని విధాలా అభివృద్ధి చేస్తా

**• జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా**




**కర్నూలు (జర్నలిస్ట్ ఫైల్):** ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో కర్నూలు జిల్లాను అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఉదయం 10.15 గంటలకు జిల్లా కలెక్టర్ పి. రంజిత్ బాషా పదవీ బాధ్యతలను స్వీకరించారు. అనంతరం మత పెద్దలు సర్వమత ప్రార్థనలు నిర్వహించి కలెక్టర్ ను ఆశీర్వదించారు.

బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్ పాత్రికేయులతో మాట్లాడుతూ ఈరోజు కర్నూలు జిల్లా కలెక్టర్ గా బాధ్యతలు తీసుకోవడం సంతోషంగా ఉందన్నారు. కర్నూలు జిల్లా తనకు సొంత జిల్లా లాగా అని, తన స్వస్థలం నందికొట్కూరు నియోజకవర్గమని, తన విద్యాభ్యాసం కొంత వరకు ఉమ్మడి కర్నూలు జిల్లాలోనే జరిగిందన్నారు. దాదాపు 20 సంవత్సరాల కిందట ఉద్యోగ రీత్యా కర్నూలు జిల్లాను విడిచి వెళ్లడం జరిగిందని, మరలా 20సంవత్సరాల తర్వాత జిల్లా కలెక్టర్ గా సొంత జిల్లాకు రావడం చాలా సంతోషంగా ఉందన్నారు.

ప్రజా ప్రతినిధులు, జిల్లా ప్రజల సహకారంతో జిల్లా అభివృద్ధికి మరింత కృషి చేస్తానన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యతలకు అనుగుణంగా కార్యాచరణ ప్రణాళికను రూపొందించుకుని అమలు చేస్తానని, జిల్లా ప్రజలందరికీ మేలు చేకూరే విధంగా జిల్లా అడ్మినిస్ట్రేషన్ తరఫున తీసుకోవాల్సిన అన్ని రకాల చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు..అనంతరం నూతన కలెక్టర్ కు జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య, ఆదోని సబ్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, డీఆర్ఓ మధుసూదన్ రావు, జిల్లా అధికారులు, తదితరులు పుష్పగుచ్ఛాలతో అభినందనలు తెలిపారు.

## పాపికొండలు విహారయాత్రను నిలిపేసిన అధికారులు



**తూర్పు గోదావరి ( జర్నలిస్ట్ ఫైల్ ):** తూర్పు కనుమల్లోని దట్టమైన అడవితో కూడిన పాపికొండల పర్వతశ్రేణి అందాలు పర్యాటకుల్ని ఆకట్టుకుంటాయి. ఇవి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని పశ్చిమ గోదావరి, తూర్పు గోదావరి జిల్లాల నడుమ ఉన్నాయి. చాలామంది యాత్రికులు పాపికొండల విహారానికి వెళుంటారు. గోదావరి పై లాంచీ ప్రయాణం, జలపాతాలు, గ్రామీణ వాతావరణం అందరిని కట్టిపడేస్తాయి. రుతుపవనాల విస్తరణతో తెలుగు రాష్ట్రాల్లోని పలు ప్రాంతాల్లో విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఏపీలో తుఫాను హెచ్చరిక జారీ చేయడంతో పాటు గోదావరి నదిలో నీటి ఉధృతి పెరగడంతో పాపికొండలు విహార యాత్రకు బ్రేక్ పడింది. తాజాగా వాతావరణ శాఖ తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పాపికొండల విహారయాత్రను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. అనుమతి లేకుండా ఎవరైనా యాత్రకు వెళితే చర్యలు తప్పవని హెచ్చరించారు. 4 రోజుల పాటు యాత్రను నిలిపివేస్తున్నామని అధికారులు తెలిపారు. ఆ తర్వాత పరిస్థితులను బట్టి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

## ద్రావిడ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ మధు జ్యోతి రాజీనామా



**చిత్తూరు ( జర్నలిస్ట్ ఫైల్ ) :** చిత్తూరు జిల్లా కుప్పం ద్రావిడ వర్సిటీ వైస్ ఛాన్సలర్ ఆచార్య కొలకలూరి మధు జ్యోతి శుక్రవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు లేఖను ఉన్నతాధికారులకు పంపారు.. అనంతరం వర్సిటీ బోధన, భోధనేతర సిబ్బందితో ఆడిటోరియంలో సమావేశం నిర్వహించి తన పదవీ కాలంలో సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్రం టీడీపీ అధికారంలో వచ్చాక అన్ని వర్సిటీల వీసీలు, రిజిస్ట్రార్లు రాజీనామాలు చేస్తున్న క్రమంలో . ఇప్పటికే రిజిస్టర్ వేణుగోపాల్ రెడ్డి తన పదవికి రాజీనామా చేయగా తాజాగా వైస్ ఛాన్సలర్ కూడా పదవీ నుంచి తప్పుకున్నారు..

## సీపీఎస్ ను రద్దు చేసి.. సిపిఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి

- **పీఆర్సీ ఫిట్మెంట్ 45 శాతం ప్రకటించాలి**
- **విద్యా వ్యవస్థలోని అన్ని వ్యవస్థలను ఒక గొడుగు కిందకు తీసుకురావాలి**
- **117 జీవో రద్దు చేయాలి**
- **తెలుగు మాధ్యమం కొనసాగేలా చూడాలి**
- **యాజమాన్యం వారి పదోన్నతులు కల్పించాలి**
- **"తల్లికి వందనం"పథకమును ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మాత్రమే అన్వర్తింప చేయాలి**
- **o2 పాఠశాలలను ప్రజా పరిషత్ జూనియర్ కళాశాలలుగా మార్చాలి**
- **ఫోరం ఆఫ్ రిజిస్టర్డ్ టీచర్ ఆర్గనైజేషన్స్**

**అమరావతి ( జర్నలిస్ట్ ఫైల్ ) :** శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఫోర్టో రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో చైర్మన్ కరణం హరికృష్ణ, సెక్రెటరీ జనరల్ అంకాల కొండయ్య , రాష్ట్ర కో చైర్మన్ వెంకటరెడ్డి, అధికార ప్రతినిధులు బోనెల రమేష్, మాగంటి శ్రీనివాసరావు మాట్లాడుతూ...ఉన్నత సమాజాన్ని నిర్మించాలంటే విద్యా వ్యవస్థలోని అన్ని వ్యవస్థలను ఒక గొడుగు కిందకు తీసుకురావాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.సిపిఎస్ ను రద్దు చేస్తూ సిపిఎస్ ఉద్యోగులపై పెట్టిన కేసులను ఎత్తివేయాలి న్నారు .పంచాయతీరాజ్ పరిధిలోని పాఠశాలలను మండల, జిల్లా పరిషత్ యాజమాన్యంలోకి,84 జీవో రద్దు చేసి నగర, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలోని పాఠశాలలను మున్సిపల్ యాజమాన్య పరిధిలోకి విలీనం చేయాలని విజ్ఞప్తి చేశారు.

"ఉద్యోగ, ఉపాధ్యాయ, ఒకటవ తేదీన జీతాల ,పెన్షన్ల చెల్లింపుకు చట్టబద్ధం చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.విద్యా వ్యవస్థ నిర్వీర్యానికి కారణమైన 117 జీవో రద్దు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి సర్వీస్ రూల్స్ వచ్చేవరకు యాజమాన్యం వారి పదోన్నతులు కల్పించాలని చెప్పారు. పాత పెన్షన్ విధానము పునరుద్ధరణ జరగాలని విజ్ఞప్తి చేశారు. కమిటీలతో కాలయాపన లేకుండా నేరుగా 12వ పి ఆర్ సి ని ప్రకటించాలన్నారు.

పెండింగ్ బకాయిలన్నీ వెంటనే చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఉద్యోగ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి చట్టబద్ధమైన వ్యవస్థ ఏర్పాటు జరగాలన్నారు. విద్యారంగంలోని పోస్టులను బోధనా రంగంలో వారిచే మాత్రమే పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలని చెప్పారు.కర్నూలు జిల్లాలో ఎన్నికల విధులకు హాజరు కాలేదని సస్పెండ్ కాబడిన వారిని వెంటనే రివొక్ చేయాలని అభ్యర్థించారు.

కర్నూలు జిల్లాలో గొలగండ్ల ఉపాధ్యాయుని ఆత్మహత్యకు కారకులైన వారిపై చర్య తీసుకోవాలని కోరారు."తల్లికి వందనం"పథకమును ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మాత్రమే అన్వర్తింపజేసి ప్రభుత్వ పాఠశాల పరిరక్షణకు తోడ్పడాలన్నారు.జాతీయ నూతన విద్యా విధానం మరియు విద్యాహక్కుచట్టం ప్రకారం ఒకటి నుండి 8వ తరగతి వరకు ఆంగ్ల మాధ్యమంతో పాటు తెలుగు మాధ్యమం కొనసాగించాలని చెప్పారు. ప్రతి ప్రాథమిక పాఠశాలకు పి ఎస్.హెచ్ఎం పోస్టు ఉండాలన్నారు. ప్రాథమికోన్నత పాఠశాల లేదా ఉన్నత పాఠశాల వీటిలో ఏదైనా విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా వివక్షత లేకుండా మూడు నుండి ఎనిమిదవ తరగతి వరకు పాఠశాల సహాయకుల (విషయ నిపుణుల)చేతనే బోధన కొనసాగించాలని తెలిపారు. విద్యార్థుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ఉన్నత పాఠశాలకు ప్రధానోపాధ్యాయుని పోస్టు, వ్యాయామం ఉపాధ్యాయుని పోస్టు కచ్చితంగా ఉండేలా చూడాలని విశదీకరించారు.

విద్యాహక్కుచట్టం ప్రకారం ఉపాధ్యాయునికి వారానికి 30 నుండి 32 బోధనా పిరేడ్లు వచ్చే విధంగా మాత్రమే చూడాలన్నారు.ప్రాథమిక పాఠశాలలో ఒక తరగతిలో విద్యార్థుల సంఖ్య 30 మించితే, 6 ,7 ,8 తరగతులకు సంబంధించి ఒక్కొక్క తరగతి నందు విద్యార్థుల సంఖ్య 35 మించితే, 9 ,10 తరగతిలో సంబంధించి ఒక్కో తరగతిలో విద్యార్థుల సంఖ్య 40 మించితే అదనపు సెక్షన్లను ఏర్పాటు చేయాల్సిన ఆవశ్యకత ఉందని విశ్లేషించారు. ఉన్నత పాఠశాలలో ప్రతి ఐదు సెక్షన్లకు ఏడుగురు పాఠశాల సహాయకులు, ఒక వ్యాయామ ఉపాధ్యాయుడు ఉండేలా చూడాలని సోదాహరించారు.

పెరిగిన ప్రతి ఐదు సెక్షన్లకు పై విధంగా అదనంగా ఉపాధ్యాయులను కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పటిష్టమైన విద్య, నాణ్యమైన విద్యాబోధనకు ఉపాధ్యాయులకు అదనపు విధులనుండి తప్పించాలని కోరారు.o2 పాఠశాలలను" ప్రజా పరిషత్ జూనియర్ కళాశాలలుగా"మార్చాలన్నారు. ఈ కళాశాలల నందు 9 10 తరగతిలో బోధించేందుకు పీజీటీలుగా, 11,12 తరగతులు బోధించేందుకు జూనియర్ లెక్చరర్లు గా పదోన్నతి కల్పించాలని కల్పించాలని కోరారు. ప్రతి పాఠశాల సముదాయ పాఠశాలను ప్రజా పరిషత్ జూనియర్ కళాశాల మార్చాలన్నారు. ఆన్లైన్ శిక్షణకు స్వస్తి పలికి జిల్లాకొక ప్రత్యంతర శిక్షణ కేంద్రాన్ని నెలకొల్పి నిరంతరం కొనసాగేలా చూడాలని చెప్పారు. జిల్లా కొక డైట్ కాలేజీ, హెచ్ ఎస్ ఇ ఎల్ టి సి కేంద్రాన్ని ఏర్పాటు చేయాలన్నారు. ప్రవేట్ సెక్టార్ కి సంబంధించి జీవో నంబర్ 1 ను పటిష్టంగా అమలు పరచాలన్నారు. విద్యాబోధన సక్రమంగా జరుగుటకు పాఠశాల పనివేళల్ని మార్చాల్సిన ఆవశ్యకతను విశ్లేషిస్తూ ప్రాథమిక పాఠశాలలు 9.15గంటలకు, ప్రాథమికోన్నత పాఠశాలలు 9.30 గంటలకు, ఉన్నతపాఠశాలలు 9.40 గంటలకు ప్రారంభించాలని కోరారు.

అనేక పోస్టులు ఖాళీ ఉన్నందున సబ్జెక్టు టీచర్ల కొరుతూ ఉన్నందున డిఎస్సి నియామకం జరిగే వరకు ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని కోరారు. ఏకోపాధ్యాయ పాఠశాలలలో ఇద్దరు ఉపాధ్యాయులు ఉండేలా చూడాలన్నారు. కేజీబీవీ సిఆర్టి లకు ఎంటిఎస్ అన్వర్తింపజేయాలని విన్నవించారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వసంతరావు, శేష ఫణి , కేశినేని ప్రభాకర్ రావు, గోపాలప్ప, దొడ్డా ఉమామహేశ్వరరావు, కుమార్, అమర్నాథ్, ఆదిశేషయ్య, వేణుగోపాల్, ఏపీ సిపిఎస్ ఇఎ రామన్న తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ ఫైల్

మీరు చందాదారులుగా చేరాలనుకుంటున్నారా..
సకాలంలో పేపరు అందడం లేదా..
సంప్రదించండి - 7661805968

అతితక్కువ ఖర్చుతో పుట్టినరోజు, వివాహ వేడుక, పదవీ విరమణ,
ప్రారంభోత్సవం, శ్రద్ధాంజలి, పేరుమార్పు, లీగల్ ప్రకటనలకు...
సంప్రదించండి - 7416812467

Edited, Printed and Published by D.Ajay at Express Printers and Publishers D.No. 3-28-1, Brundavan Gardens, Guntur (A.P)-522006. RNI No. 52813/1993.
Administration Office : 126-352, Between 4th & 5th lanes , Kodandarama Nagar, Gorlavaripalem Donka, Gorantla, Guntur (AP)-522034. Ph 8106539118, 7416812467